క్లుప్తంగా

నగదు ప్రోత్సాహకం అందజేత



నగదు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

ఆమదాలవలస: పట్టణంలో గల గేటు మున్సిపల్ హైస్కూల్‌లో 2023–24లో పదో తరగతి పరీక్షల్లో 550 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు (చిన్ని) గురువారం అందించారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు పట్టణంలోని గేటు ప్రాంతంలోని శివలింకి ఢిల్లేశ్వరి, గంటేటి పావని, కుప్పిలి రుతిక, బస్వా నీరజకు రూ.1,000 చొప్పున అందజేశారు. గత ఐదేళ్ల నుంచి ఉత్తమ విద్యార్థులకు తన తండ్రి జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు అల్లంశెట్టి తెలిపారు. 2024–25లోనూ ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తానని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం పలు కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న 50 శాతం సబ్సిడీ రుణాలనులబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులతో కలిసి గురువారం ఇంటర్వ్యూ నిర్వహించారు. మున్సిపాలిటీలోని 23 వార్డులకు 69 యూనిట్లు మంజూరుకాగా.. 489 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరైన రుణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. పలు బ్యాంక్‌ల మేనేజర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ పూజ



కలశాలతో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారికి గురువారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఈ ఆలయంలో జరుగుతున్న వసంత త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులతో కుంకుమార్చనలు చేయించారు.

వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులను అందజేస్తున్న మోహన్‌రావు దంపతులు

కొత్తూరు: మండలంలోని వరప్రద వేంకటేశ్వర స్వామి ఆలయానికి కొత్తూరుకు చెందిన ఎస్‌బీఐ విశ్రాంత ఏబీఎం దూలి మోహన్‌రావు, ఈశ్వరి దంపతులు మూడు వెండి చెంబులను (300 గ్రాములు) గురువారం బహూకరించారు. వీటిని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులుకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు, ఆధ్యాత్మిక వేత్తలు పొగిరి రవి, భానోజీరావు, ఇప్పిలి జానకిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గొర్రిబంద వాసికి.. అరుదైన గౌరవం



సుజాతకు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామానికి చెందిన మొయ్యి సుజాతకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కింది. ఆ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో గురువారం ధ్రువపత్రం అందించారు. సుజాత భర్త అప్పారావు ఆర్మీలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. హైదరాబాద్‌లో కుటుంబంతో నివాసం ఏర్పర్చుకున్నారు. కరోనా సమయంలో అప్పారావు మృతి చెందారు. సుజాత పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు భర్త పేరుపై హైదరాబాద్‌లో ఒక ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. చదువు లేకపోయినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సుజాత సంకల్పానికి గొర్రిబందకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

మహాప్రభో.. మా పొట్ట కొట్టొద్దు..!



తనిఖీలకు హాజరైన దివ్యాంగులు

- కొనసాగుతున్న సదరం సర్టిఫికెట్ల పరిశీలన
- నరసన్నపేట, సారవకోట మండలాలకు సంబంధించి తనిఖీలు పూర్తి..
- నేటి నుంచి జలుమూరు మండలం దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన
- మండుటెండలో వ్యయప్రయాసలు
- పింఛన్ల తొలగిస్తారనే ప్రచారంతో ఆందోళన చెందుతున్న దివ్యాంగులు



దివ్యాంగత్వాన్ని పరిశీలిస్తున్న వైద్యురాలు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎలా తగ్గించాలనే ఆలోచనతోనే పాలన సాగిస్తోంది. ఒకవైపు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. మరోవైపు గత ప్రభుత్వం ఇచ్చిన అనేక పథకాలకు కొతవేసింది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు సదరం సర్టిఫికెట్ల పరిశీలన గత కొద్ది రోజులుగా నిరంతరాయగా కొనసాగుతోంది. మండుటెండల్లో దివ్యాంగులు వ్యయప్రయాసలకు ఓర్చి సదరం క్యాంప్‌లకు వస్తున్నారు. నరసన్నపేట మండల కేంద్రంలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో గత మూడు నెలలుగా దివ్యాంగ సర్టిఫికెట్ల తనిఖీలను పాలకొండ ఆస్పత్రికి చెందిన ఆర్థో వైద్యురాలు యశశ్వని నిర్వహించారు. గురువారం వరకు నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన దివ్యాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. శుక్రవారం నుంచి జలుమూరు మండలానికి చెందిన దివ్యాంగులకు ఇచ్చే సర్టిఫికెట్లను పరిశీలించి అర్హత ఏ మేరకు ఉందో నిర్ధారించనున్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. తనిఖీలకు నానా ప్రయాసలు పడి వస్తున్నారు. తనిఖీల్లో సగానికి పైగా సర్టిఫికెట్లు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరగడంతో ఇప్పటి నుంచే పలువురికి భయం పట్టుకుంది.

పింఛన్లు కట్..!

నరసన్నపేట మండలంలో 575 మంది సర్టిఫికెట్లను తనిఖీలు చేయగా.. వీరిలో 255 మంది వరకు పింఛన్లు పోయే అవకాశం ఉంది. పోలాకి మండలంలో 478 మందికి తనిఖీలు చేపట్టగా వీరిలో 220 మంది వరకు లబ్ధిదారులకు పింఛన్లు కట్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ప్రభుత్వం తమ పొట్ట కొట్టేందుకే చూస్తోందని.. తమకు గత పదేళ్లుగా వస్తున్న పింఛన్లు ఇప్పుడు తనిఖీలు చేసి నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. జలుమూరు మండలంలో 534 మంది, సారవకోట మండలంలో 449 మందికి దివ్యాంగులకు పింఛన్లు వస్తున్నాయి. వీరి సర్టిఫికెట్లను పాతపట్నంలో పరిశీలన చేయనున్నారు.

కాళ్లు పనిచేయవు



నాకు కాళ్లు పనిచేయవు. గడిచిన 15 ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఈ పింఛనే నాకు జీవనాధారం. తనిఖీలకు రమ్మనమని అంటే ప్రత్యేకంగా ఆటో కట్టించుకొని వచ్చాను. ఇప్పుడు ఏం చేస్తారో, సర్టిఫికెట్ ఏమని ఇస్తారో ఆందోళనగా ఉంది.

– కిల్లి దుర్గారావు, సుసరాం, పోలాకి మండలం

ఒక కాలు లేదు..



వృద్ధాప్యంలో ఉన్నాను. ప్రభుత్వ ఇస్తున్న పింఛన్‌తో కాలం గడుపుతున్నాను. గతంలో ఒక కాలు పోయింది. అప్పటి నుంచి పింఛన్ వస్తోంది. తనిఖీలు దగ్గర్లో చేస్తే బాగుండేది. 20 కిలో మీటర్ల దూరం నుంచి ఆస్పత్రికి వచ్చాను. నాకు తోడుగా మరో ఇద్దరు వచ్చారు. రూ.500లకు ఆటో బుక్ చేయించుకొని వచ్చాం.

– గురుగుబెల్లి కృష్ణయ్య, ఉర్జాం, పోలాకి మండలం

కల్యాణం.. కమనీయం



ఎల్.ఎన్.పేట: పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



నరసన్నపేట: సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి గ్రామంలో గల భువనేశ్వరి సహిత పరమేశ్వర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, దక్షిణమూర్తి ఆలయ 23వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా చేపట్టారు. ఆలయ అర్చకుడు బంకుపల్లి మధుబాబు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గాలాల వెంకటచిన్నప్పలనాయుడు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

వైభవంగా..

నరసన్నపేట: స్థానిక జట్టు కలాసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతారామస్వామి వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ పాగోటి జయలక్ష్మి, రాజారావు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జట్టు కలాసీ సంఘం అధ్యక్షుడు జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడు పుచ్చల విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: మండల కేంద్రంలోని అలికాం–బత్తిలి ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద నిల్వ ఉంటున్న మురుగునీటిని వెంటనే తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. కొత్తూరులో గురువారం స్థానికులతోపాటు పలువురు ప్రయాణికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మురుగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గతేడాది అక్టోబర్‌లో హామీ ఇచ్చారన్నారు. ఆరు నెలలు కావస్తున్నా ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు. రోడ్డుకు అనుకొని నివాసం ఉంటున్న పలు కుటుంబాలవారు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రయాణికులు నరకయాతన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీటి నిల్వకు కారణమైన (మూతపడిన) కల్వర్టును తెరిపించాలని అధికారులను కోరారు. ఈ సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు. స్థానికులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి లక్ష్మీప్రసన్న

జలుమూరు: క్షయ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న లక్ష్మీ అన్నారు. పీహెచ్‌సీలో గురువారం రోగులకు క్షణ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ రోగులకు ఎటువంటి పరీక్షలు నిర్వహించాలో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. నరసన్నపేట టీబీ యూనిట్ వైద్యాధికారి సుజాత, హెచ్ఎస్ యు.చిన్నరాజులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆపోజిట్ ఆర్ ఆర్ కాలనీలో నిర్మిస్తున్న భీమసింగేశ్వర ఆలయానికి కొత్తూరుకు చెందిన మాల్లా మాధవరావు (విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజ్ విశ్రాంత చీఫ్ లైబ్రేరియన్) రూ.2 లక్షలు విరాళం గురువారం అందజేశారు. ఆలయ నిర్మాణ పనులకు రూ.లక్ష, ఏకశిలా విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష అందజేసినట్లు సర్పంచ్ పెదకోట సాధుబాబు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గోగులు వరప్రసాదరావు నాయుడు పాల్గొన్నారు.

పుస్తక పఠనం

ఎల్.ఎన్.పేట: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె.మిశ్రో అన్నారు. లక్ష్మీనర్సుపేటలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయుడు టి.ఉపేంద్ర ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పొందూరు: ఈ నెల 4వ తేదీన స్థానిక పట్టుశాలీ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ సమావేశం సాయంత్రం 3.30 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలస నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి ముందుగా ప్రకటించిన ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్ష ఈ నెల 13వ తేదీకి మార్పు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఇన్‌చార్జి ఎం.చంద్రరావు, కో ఆర్డినేటర్ డి.దాశరథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వైటీసీలో నాలుగు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. కంప్యూటర్ బేసిక్స్, ఎం.ఎస్.ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనల్ డవలప్‌మెంట్ స్కిల్స్, తదితర కోర్సులకు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సువారు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఉచితంగా హాస్టల్, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. 105 సీట్లు మాత్రమే ఉన్నాయని, పూర్తి వివరాలకు ఫోన్ 9963646329, 9704268093 నంబర్లను సంప్రదించాలన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



జ్ఞానసరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, గ్రామస్తులు

పొందూరు రూరల్: మండలంలోని గూనానపేట ప్రాథమిక పాఠశాలలో జ్ఞాన సరస్వతీదేవి విగ్రహాన్ని హెచ్ఎం గురుగుబెల్లి మధుబాబు, గ్రామ పెద్దలు గురువారం ఆవిష్కరించారు. గ్రామస్తులంతా కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కుప్పిలి శ్రీనివాసరావు, వైస్‌చైర్‌పర్సన్ కిల్లారి ఉమ, గూనాన కృష్ణ, జగ్గరౌతు జగ్గప్పడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన



సారవకోట మండలంలోని బుడితి సీహెచ్‌సీ ఆవరణలో సుఖ ప్రసవంపై ఆస్పత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్టు సుజనీకుమారి గురువారం అవగాహన కల్పించారు. సాధారణ ప్రసవం వల్ల తల్లీబిడ్డకు శ్రేయస్కరమన్నారు. సాధారణ కాన్పు అయితే తల్లి త్వరగా కోలుకుని బిడ్డ ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తుందన్నారు. బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వడం వలన.. బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

– సారవకోట

నిరుపయోగం



సరుబుజ్జిలి మండలం చిన కాగితాపల్లి పంచాయతీ పరిధిలోని వీరభద్రాపురంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రీన్‌అంబాసిడర్లు వెళ్లి చెత్తను సేకరించాలి. ఆ చెత్తను తడి, పొడిగా వేర్వేరుగా కుండీల్లో నిల్వ చేయాలి. చెత్తను రీసైక్లింగ్ చేసి వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు విక్రయించాలి. దీని ద్వారా వచ్చిన ఆదాయం పంచాయతీకి జమ చేయాలి. ఇవేవీ ఇక్కడ అమలు కావడం లేదు.

– సరుబుజ్జిలి

అవస్థలు



నరసన్నపేట మండలం పారశెల్లి ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 20 రోజులుగా కుళాయిల ద్వారా నీరు రావడం లేదు. గ్రామంలోని ప్రధాన రోడ్డును పునర్ నిర్మించేందుకు తవ్వారు. అప్పటినుంచి నీరు అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పైపులు బాగు చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– నరసన్నపేట

షట్టర్లు బాగుచేయాలి



సరుబుజ్జిలి మండలంలోని యరగాం– పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్‌లో ఏళ్ల తరబడి మరమ్మతులు లేక రైతులుకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు. ప్రధానంగా సాగునీటిని మళ్లించే షట్టర్లు, చెక్‌డ్యామ్‌లు సక్రమంగా పని చేయడంలేదు. దీనివలన అత్యవసర పరిస్థితుల్లో సాగునీటిని నిల్వ చేయలేక నీటి కొరత ఏర్పడుతుంది. ఇప్పటికైనా వంశధార అధికారులు స్పందించి రానున్న ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

పట్టుదలగా చదవండి.. లక్ష్యం చేరుకోండి



ఎంసెట్ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: పోటీ ప్రపంచంలో పట్టుదలతో చదివే విద్యార్థులే అనుకున్న లక్ష్యాలు చేరుకోగలరని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక డీఆర్ఎస్ కళాశాలలో ఎంసెట్ కోచింగ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంసెట్ మెటీరియల్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. కొంతమంది విద్యార్థులకు మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో మెలకువలు అవసరమన్నారు. ఎంత పట్టుదలగా చదివితే అంత మించి మార్కులు పొందవచ్చన్నారు. కోచింగ్ సెంటర్‌ను సక్రమంగా నిర్వహించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, కనలప శేఖర్, బొబ్బాది ఈశ్వరరావు, దుల్ల రమణ, రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనం రూ.307



హిరమండలంలో ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులు

హిరమండలం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే వేతనదారులకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.307 చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.300 ఉండగా.. ఈ ఏడాది స్వల్పంగా రూ.7 పెంచారు. కేంద్రం జారీ చేసిన ఉత్వర్వులు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చినట్లు ఏపీఓ ఎ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు కేటాయించిన కొలతలతో పనులు పూర్తిచేస్తే వేతనదారులకు ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట వేతనం అందనుంది. గత ఐదేళ్లతో పోల్చితే ఈ ఏడాది పెంచిన వేతనం తగ్గించినట్టేనని వేతనదారులు చెబుతున్నారు. 2020–21లో రూ.230 చెల్లించేవారు. 2022లో రూ.15, 2023లో రూ.12, 2024లో రూ.15, 2025లో రూ.28 పెంచారు. ఈ ఏడాది కనీస వేతనం రూ.7 పెంచడంపై వేతనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం రైతువారీ పనులు లేవు. ఉన్న పనులన్నీ యంత్రాలతో చేయిస్తున్నారు. గ్రామీణ వేతనదారుల జీవనోపాధికి ఉపాధి హామీ పనులే ఆధారం. మండుటెండలో సైతం వేతనదారులు పనులు చేస్తున్నారు. కుటుంబ పోషణకు ఉపాధి పనుల్లో పాల్గొనే శ్రమజీవులకు మరికొంత ఎక్కువ మొత్తంలో వేతనాలు పెంచాలని వేతనదారులు కోరుతున్నారు.